క్లుప్తంగా

డీఈఓకి వినతి

కొయ్యలగూడెం: అన్ని విధాల అర్హతలు ఉన్న దిప్పకాయలపాడు ఎంపీపీ స్కూల్‌ని హైస్కూల్‌గా మార్చాలంటూ గ్రామ పెద్దలు బుధవారం డీఈఓకి వినతిపత్రం సమర్పించారు. ఏలూరులోని డీఈవో కార్యాలయంలో కలిసి ఈమేరకు వినతిపత్రం అందజేశారు. అదేవిధంగా గ్రామ పంచాయతీ పరిధిలోని గొల్లగూడెంలో ఉన్న ఎంపీపీ స్కూల్‌ను ఎంపీయూపీ స్కూల్‌గా మార్చాలని వారు డీఈఓని కోరారు. దీనిపై పాఠశాలలను సందర్శించి విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టిలో పెడతానని డీఈవో హామీ ఇచ్చారని గ్రామ పెద్దలు తెలిపారు. గిడా గిరటయ్య బాబు, దుగ్గిరాల విజయ భాస్కర్, అత్తర్ సిద్దు సాహెబ్ పాల్గొన్నారు.

తపస్సు కాల దీక్ష ప్రారంభం

కామవరపుకోట: స్థానిక ఆర్‌సీఎం పరిశుద్ధ జపమాలరాజ్ఞి దేవాలయంలో విచారణ గురువు ఫాదర్ గోగు పీటర్ ప్రసాద్ ఆధ్వర్యంలో దాదాపు 200 మంది విశ్వాసులు 40 రోజుల తపస్సు కాల దీక్షను స్వీకరించారు. ఈ సందర్భంగా ఫాదర్ పీటర్ ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రిగి నలిగిన హృదయం కలిగి ఉపవాసం, దానధర్మాలు చేస్తూ ప్రార్థన జీవితంతో జీవించాలని విచారణ గురువులు విశ్వాసులకు తెలిపారు.

ఆంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం

బుట్టాయగూడెం: మండలంలోని కొమ్ముగూడెంలో కొలువైన ఆంజనేయ స్వామి 9వ వార్షికోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అ నంతరం ఘనంగా అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

అమరవరం రేంజ్‌లో విచారణ

కుక్కునూరు: అమరవరం అటవీ రేంజ్ పరిధిలో యథేచ్ఛగా సాగుతున్న మారుజాతి కలప అక్రమ రవాణాపై బుధవారం సాక్షి పత్రికలో ప్రచురితమైన కథనానికి స్పందించిన అటవీశాఖ జిల్లా అధికారులు బుధవారం అమరవరం రేంజ్ పరిధిలోని బర్లమడుగు, కొండిన్యముక్తి టేకు ప్లాంటేషన్ ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అటవీ ప్రాంతంలో నిఘాను కట్టుదిట్టం చేయాలని రేంజ్ అధికారిని ఆదేశించినట్లు తెలుస్తుంది. విధులలో సిబ్బంది నిర్లక్ష్యం ప్రదర్శిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించినట్లు సమాచారం.

సత్య సాయి సప్తాహం

కొయ్యలగూడెం: భగవాన్ శ్రీసత్య సాయిబాబా అఖండ నామ యజ్ఞ సప్త సప్తాహ కార్యక్రమం సత్యసాయి నగర్‌లోని ఉన్న బాబా వారి మందిరంలో బుధవారం సాయంత్రం ఆరు గంటల నుంచి ప్రారంభమైంది. గురువారం సాయంత్రం ఆరు గంటల వరకు శ్రీసత్య సాయి నామ సంకీర్తన కార్యక్రమం నిర్వహించనున్నారు. కార్యక్రమంలో వంద మందికి పైగా భక్తులు అఖండ నామ సంకీర్తనలో పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్‌కు చెందిన కె.శ్రీనివాసాచారి దంపతులు బుధవారం రూ. 3,65,000 లను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా దాత దంపతులను ఆలయ అధికారులు అభినందించారు.

రామా కనవేమిరా !



నూతనంగా నిర్మిస్తున్న రామాలయం వ్యూ



నూతనంగా నిర్మించిన రామాలయ ముందు భాగం

- సర్వాంగ సుందరంగా కోదండ రామాలయం
- 15 నుంచి పునః ప్రతిష్ఠా కార్యక్రమాలు

జంగారెడ్డిగూడెం: పట్టణ పరిధిలోని రామచంద్రాపురంలో రామాలయ నిర్మాణం సర్వాంగ సుందరంగా నిర్వహిస్తున్నారు. ఆలయ పునః ప్రతిష్ఠా కార్యక్రమాలు ఈ నెల 15 నుంచి ప్రారంభం కానున్నాయి. 1960లో జంగారెడ్డిగూడెం పంచాయతీగా ఉన్న సమయంలో రామాలయం ఒక పెంకుటింటిలో ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఈ ప్రాంతాన్ని రామచంద్రాపురంగా పిలుస్తారు. అలాగే 2000వ సంవత్సరం వరకు పెంకుటింటిలోనే కోదండ రామాలయం కొనసాగింది. అనంతరం పెంకుటిల్లును తొలగించి రామాలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. దీంతో అక్కడ ఆర్‌సీసీ శ్లాబ్‌తో నిర్మాణం చేసి అందులో ఇప్పటి వరకు కొనసాగింది. ఇటీవల కాలంలో దేవాలయ నిర్మాణం పూర్తి చేసి ఆలయ పునః ప్రతిష్ఠా కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందుకోసం 15 మంది సభ్యులతో ఆలయ అభివృద్ధి కమిటీ ఏర్పాటైంది. మహాబలిపురం నుంచి విగ్రహాలు, వరంగల్ నుంచి 29 అడుగుల ఏక శిల ధ్వజ స్థంభం ఇప్పటికే తీసుకొచ్చి భద్రపరిచారు. పూర్తిగా దాతల సహకారం, విరాళాలతో ఈ ఆలయ నిర్మిస్తున్నారు. ఆలయ నిర్మాణం మొత్తం ఆధ్యాత్మిక వాతావరణంతో అత్యంత సుందరంగా చేస్తున్నారు. గోపురం, శాల హారం, గ్రానైట్ ఫ్లోరింగ్ పూర్తి అవుతున్నాయి. రాముడు, సీతా, లక్ష్మణ, ఆంజనేయస్వామి, వినాయకుడు, అమ్మవారి విగ్రహాలు కృష్ణ శిలతో తయారు చేయించి మహాబలిపురం నుంచి తీసుకొచ్చారు. ఈ నెల 15 నుంచి 17 వరకు కోదండ రామాలయ పునః ప్రతిష్ఠా కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ కమిటీ శరవేగంగా ఏర్పాట్లు చేస్తుంది. సుమారు రూ.60 లక్షలతో ఈ ఆలయ నిర్మాణం చేపట్టారు.

రామచంద్రాపురంగా ప్రసిద్ధి



రాముడి ప్రతిష్ఠ అనంతరం ఈ ప్రాంతాన్ని రామచంద్రాపురంగా పిలుస్తున్నారని, ఈ ప్రాంతానికి గుర్తింపు తెచ్చిన ఆలయాన్ని పునః నిర్మించేందుకు కృషి చేస్తున్నాం. ఇప్పటికే ఆలయ నిర్మాణం పూర్తి కావస్తుండగా, ఈ నెల 15 నుంచి పునః ప్రతిష్ఠా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

– పరిమి సత్తిపండు, ఆలయ అభివృద్ధి కమిటీ గౌరవాధ్యక్షుడు

దాతల సహకారం మరువలేనిది



దాతల సహకారం, సహాయంతో కోదండ రామాలయాన్ని పునః నిర్మించాం. మహా బలిపురం నుంచి రాముడు, సీత, లక్ష్మణ, ఆంజనేయస్వామి, వినాయకుడు, అమ్మవారి విగ్రహాలను కృష్ణ శిలతో తయారు చేయించి తీసుకొచ్చాం. ధ్వజ స్థంభానికి 29 అడుగుల ఏక శిల ధ్వజ స్థంభాన్ని వరంగల్ నుంచి తెప్పించాం.

-కొండ్రెడ్డి కిషోర్, ఆలయ అభివృద్ధి కమిటీ గౌరవాధ్యక్షుడు

ఏర్పాట్లు పూర్తి



ఆలయ పునః ప్రతిష్ఠా కార్యక్రమాలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశాం. ఆలయ కమిటీ ఏర్పాట్లను శరవేగంగా చేపట్టింది. ఆలయాన్ని సుందరంగా రూపొందించేందుకు రూ.60 లక్షలు దాతలు అందించిన విరాళాలను వెచ్చించాం.

-మోతుకూరి నారాయణరావు, ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు

పొగాకు రైతులను ఆదుకోవాలి



పొగాకు రైతు ప్రసాద్‌ను వివరాలు అడిగి తెలుసుకుంటున్న మాజీ ఎమ్మెల్యే బాలరాజు

బుట్టాయగూడెం: జీలుగుమిల్లిలో ఇటీవల సంభవించిన అగ్ని ప్రమాదంలో పొగాకు పంట నష్టపోయిన రైతు కొప్పుల ప్రసాద్‌ను బుధవారం మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పరామర్శించారు. ఈ సందర్భంగా అగ్నిప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అగ్ని ప్రమాదాల వలన నష్టపోయిన రైతు ప్రసాద్‌ను పొగాకు బోర్డు అధికారులు ఆదుకోవాలని కోరారు. ఎన్నో ఆశలతో రైతులు పంటలు వేస్తే అవి ఏదో ఒక విపత్తు కారణంతో రైతులు నష్టాల పాలవుతున్నారని రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చందా ప్రసాద్, ఉప్పల రాంపండు, కొప్పుల సత్యనారాయణ, తగరం రాంబాబు, బోసు, టోని, కుసుమ వెంకట్, రమేష్, చిట్టిబొమ్మ శ్రీను, కక్కిరాల చక్రి, తదితరులు పాల్గొన్నారు.

చలో ఏలూరుకు తరలిరండి



తాడిచెర్లలో మాట్లాడుతున్న రైతు కూలీ సంఘ నాయకులు

కామవరపుకోట: కోకో రైతుల సమస్యలపై ఈ నెల 6న (నేడు) నిర్వహిస్తున్న కోకో రైతుల చలో ఏలూరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ కామవరపుకోట మండలంలోని తాడిచర్ల, కామవరపుకోట, ఆడమిల్లి, తడికలపూడి తదితర గ్రామాలలో ఏపీ కోకో రైతుల సంఘం నాయకులు ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా గ్రామాలలో జరిగిన కోకో రైతుల సమావేశాలల్లో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కట్టా భాస్కరరావు, జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, కోకో రైతుల సంఘం నాయకులు బొల్లు రామకృష్ణ, గుది బండి రమేష్ రెడ్డి మాట్లాడారు. అంతర్జాతీయ మార్కెట్ ప్రకారం కోకో గింజలకు ధర చెల్లించాలని కోరారు. కంపెనీలు సిండికేట్‌గా మారి కోకో రైతులను నష్టపరచడాన్ని అరికట్టాలని కోరారు. కిలో కోకో గింజలకు రూ. 900 ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు. కోకో రైతులందరూ సంఘటితం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలువురు కోకో రైతులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న మహిళా దినోత్సవం



అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: విద్యార్థినులు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని, శారీరకంగా, మానసికంగా, ఆరిల్థకంగా ఎదగాలని ఐసీడీఎస్ సీడీపీవో పి.బ్యూల అన్నారు. జంగారెడ్డిగూడెం మండలం పంగిడిగూడెం, శ్రీనివాసపురం గ్రామాల్లో హైస్కూళ్ల వద్ద బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యూల మాట్లాడుతూ మహిళా దినోత్సవ వేడుకలు 5వ రోజు ఆయా హైస్కూళ్లలో కౌమార బాలికలకు కెరీర్ అవకాశాలు, ఇంటర్ చదివిన విద్యార్థులకు తడికలపూడి మహిళా ప్రాంగణంలో అందించే వృత్తి విద్యాకోర్సులు గురించి వివరించామన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్‌లు కె.లక్ష్మి, విజయలక్ష్మి, శ్రీనివాసపురం, పంగిడిగూడెం అంగన్‌వాడీలు జ్యోతి, కుమారి, దుర్గమ్మ, స్వర్ణలత, జి.విమల, ఎం.సునీత, డి.నాగేశ్వరమ్మ, అంగన్‌వాడీ సహాయకులు, గర్భవతులు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

కోకో పంటకు గిట్టుబాటు ధర కల్పించాలి



కోకో కాయలతో ప్రదర్శన చేస్తున్న రైతు సంఘ నాయకులు

ద్వారకాతిరుమల: అంతర్జాతీయ మార్కెట్ ధరకు అనుగుణంగా కోకో గింజలు కిలో రూ. 900 లకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం కోకో రైతుల చలో ఏలూరు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు కోకో రైతుల సంఘం, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు తెలిపారు. ఆరోజు ఉదయం 10 గంటలకు కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తామని చెప్పారు. అందులో భాగంగా బుధవారం ద్వారకాతిరుమల మండలంలోని పంగిడిగూడెం, సూర్యచంద్రరావుపేట, గొల్లగూడెం, తిమ్మాపురం, ద్వారకాతిరుమల తదితర గ్రామాల్లో చలో ఏలూరు కరపత్రాలను పంపిణీ చేసి, ప్రచారం నిర్వహించారు. అలాగే ఆయా గ్రామాల్లోని కోకో తోటలను పరిశీలించి, రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 50 వేల ఎకరాల్లో కొబ్బరి, ఆయిల్ పామ్ తోటల్లో అంతర పంటగా కోకో సాగవుతుందని, రాష్ట్రంలోనే అత్యధిక విస్తీర్ణంలో ఏలూరు జిల్లాలో ఈ పంట సాగవుతుందన్నారు. పలు డిమాండ్లపై గురువారం ఏలూరు కలెక్టరేట్ ముందు జరిగే ధర్నాలో రైతులు పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు

బుట్టాయగూడెం: జీలుగుమిల్లి మండలం దర్భగూడెంలో నిర్వహిస్తున్న భూలక్ష్మి అమ్మవారి 50వ వార్షికోత్సవ మహోత్సవ వేడుకల్లో బుధవారం మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులు పోలవరం నియోజకవర్గంలోని ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే బాలరాజుతో పాటు వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కొల్లారి రాంబాబును ఆలయ కమిటీ వారు శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు ముప్పిడి సురేష్ రెడ్డి, కేతిరెడ్డి రాఘవరెడ్డి, కె.హనుమంతరావు, పాల్గొన్నారు.

అంతర్జాతీయ మహిళా దినోత్సవ ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది, విద్యార్థినులు

కొయ్యలగూడెం: అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో భాగంగా బుధవారం గవరవరం గ్రామంలో ఐసీడీఎస్ శాఖ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థినిలతో కలిసి నిర్వహించిన సమావేశంలో సూపర్‌వైజర్ అంబటి సరస్వతి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. హైస్కూల్ దశలో ఉన్న విద్యార్థినులు తమ కెరీర్ పట్ల శ్రద్ధ, అవగాహన కలిగి ఉండాలని సూచించారు. మహిళా పోలీస్ అరుణ, అంగన్‌వాడీ సిబ్బంది నాగమణి, నాగకుమారి, సీహెచ్ పాప, హైస్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో బేరన్లు దగ్ధం



అగ్నిప్రమాదానికి గురైన బేరన్

బుట్టాయగూడెం: జీలుగుమిల్లి మండలం రాచన్నగూడెంలో బుధవారం సాయంత్రం సంభవించిన అగ్ని ప్రమాదంలో ఒక పొగాకు బేరన్ పూర్తిగా దగ్ధమైంది. గ్రామానికి చెందిన సత్యనారాయణ, అర్జున్‌రావు అనే వ్యక్తులకు చెందిన బేరన్లు పొగాకు క్యూరింగ్ చేస్తుండగా ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి ప్రమాదం సంభవించినట్లు వారు తెలిపారు. గ్రామస్తులు మంటలను అదుపు చేసే ప్రయత్నం చేసినప్పటికీ అప్పటికే బేరన్ పూర్తిగా దగ్ధమైనట్లు గ్రామస్థులు తెలిపారు.

కన్నాపురంలో నాలుగు బ్యారెన్లు దగ్ధం

కొయ్యలగూడెం : కన్నాపురం గ్రామంలో సంభవించిన అగ్ని ప్రమాదంలో బుధవారం నాలుగు బేరన్లు దగ్ధం అయ్యాయి. వర్జీనియా పొగాకు క్యూరింగ్ దశలో ఉండగా అగ్ని ప్రమాదం సంభవించినట్లు ఎంపీటీసీ ఎస్కే బాజీ తెలిపారు. రైతు అల్లూరి రాంబాబుకి చెందిన నాలుగు బేరన్లలో సుమారు పది లక్షల రూపాయల విలువైన పొగాకు ప్రమాదంలో దగ్ధం అయ్యింది అన్నారు. బేరన్లు ఒకదానికొకటి పక్కపక్కనే ఉండటం వలన ప్రమాద తీవ్రత పెరిగిందన్నారు. అగ్నిమాపక వాహనం వచ్చి మంటలను అదుపు చేసింది అన్నారు. రేషన్ కర్ర క్యూరింగ్ గొట్టంపై పడటంతో ప్రమాదం సంభవించి ఉంటుందని బాజీ పేర్కొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు వితరణ



బాధితులకు సాయం అందిస్తున్న సీపీఐ నేతలు

కుక్కునూరు: అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి బుధవారం సీపీఐ నాయకులు నిత్యావసర సరుకులు, ఆర్థిక సాయం అందించారు. మండలంలోని పెద్దరావిగూడెం గ్రామంలో నివసిస్తున్న బాణోత్ సురేష్‌కు చెందిన ఇళ్లు ఇటీవల ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదంలో పూర్తిగా కాలిపోయింది. దీంతో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబానికి సీపీఐ నాయకులు రూ.2 వేల నగదు, దుస్తులు, నిత్యావసర సరుకులను అందించారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి మైసాక్షి వెంకటాచారి మాట్లాడుతూ అగ్నిప్రమాద బాధితులను అధికారులు పట్టించుకున్న పాపనపోలేదని విమర్శించారు. మడిపల్లి వెంకటరమణ,పళ్లల భిక్షం,గాడిద వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలపై అవగాహన

బుట్టాయగూడెం: మహిళలు తప్పనిసరిగా చిరుధాన్యాలను స్వీకరించి ఆరోగ్యవంతులుగా ఉండాలని బుట్టాయగూడెం ఐసీడీఎస్ సీడీపీఓ ఏలూరు తులసి అన్నారు. మండలంలోని కేఆర్‌పురంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే మహిళలకు పౌష్టికాహారంపై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు.

లింగ వివక్షకు వ్యతిరేకంగా పోరాడాలి

టి.నరసాపురం: లింగ వివక్ష సామాజిక నేరమని, బాల్యం నుంచే లింగవివక్షతకు వ్యతిరేకంగా చిన్నారులు చైతన్యవంతం కావాలని టి.నరసాపురం ఎస్సై ఎం.జయబాబు అన్నారు. మండలంలోని బొర్రంపాలెం జెడ్పీ హైస్కూల్‌లో బుధవారం లింగ సమానత్వంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ బాలబాలికలు చిరుప్రాయం నుంచే సోదర భావంతో మెలగాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మహ్మద్ ఆలీ, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు.

దివ్య దుర్గ మహిళలకు ఆదర్శం



దివ్య దుర్గను సన్మానిస్తున్న స్పందన స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

కొయ్యలగూడెం: పోలీస్ శాఖలో ఎస్సై పోస్టుకి ఎంపికై విజయవాడలో పోస్టింగ్ సంపాదించిన గుడే దివ్యదుర్గ మహిళలకు ఆదర్శంగా నిలిచిందని స్పందన స్వచ్ఛంద సంస్థ పేర్కొంది. బుధవారం కన్నాపురంలోని దివ్యదుర్గ నివాసానికి వెళ్లి సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు బొలుసు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఆమెను సత్కరించారు. సచివాలయ మహిళా కానిస్టేబుల్‌గా సమర్థవంతంగా విధులు నిర్వహిస్తూ దివ్యదుర్గ పేరు ప్రఖ్యాతులు సంపాదించిందన్నారు. సంస్థ అధ్యక్షులు రాజులపాటి ప్రవీణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి ఎస్కే జహంగీర్ భాష పాల్గొన్నారు.

ప్రభుత్వ సర్క్యులర్ ఉపసహరించుకోవాలి

కొయ్యలగూడెం: క్రైస్తవ చర్చిలకు వ్యతరేకంగా కూటమి ప్రభుత్వం జారీ చేసిన సర్క్యులర్ వెంటనే ఉపసంహరించుకోవాలని పాస్టర్స్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం డిమాండ్ చేసింది. ఫోరం ఆవిర్భావ సభ బుధవారం కొయ్యలగూడెంలోని కృపాసన్నిధిలో నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిథిగా ప్రముఖ విద్యావేత్త అలుగు ఆనంద్ శేఖర్ హాజరై క్రైస్తవ హక్కుల గురించి వివరించారు. ఫోరం గౌరవాధ్యక్షుడు హోమ్ మినిస్ట్రీస్ డైరెక్టర్ గెడ్డం శామ్యూల్ జాషువా పాస్టర్స్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం ఉద్దేశ్యాలను వివరించారు. బొగ్గవరపు బాబురావు, కోటిపల్లి బెంజిమెన్, పాలన్న, రత్న వరప్రసాద్ పాల్గొన్నారు.

సారా నిందితుల అరెస్టు

కొయ్యలగూడెం: నాటు సారా తయారీ, క్రయవిక్రయాలకు సంబంధించి నిందితులను అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ శాఖ ఇన్‌స్పెక్టర్ కె.వీరబ్రహ్మం బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కన్నాపురం గ్రామంలో బుధవారం సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించగా ఐదేసి లీటర్లు చొప్పున కలిగి ఉన్న వీరంకి ఏడుకొండలు, షేక్ సయ్యద్ బాజీలను అదుపులోకి తీసుకున్నామన్నారు. వీరికి నాటుసారా సరఫరా చేస్తున్న వేముల ఏసుబాబు కుంజ దుర్గారావులపై కేసు నమోదు చేశామన్నారు. అదేవిధంగా పోలవరం మండలం చేగొండపల్లి గ్రామంలో సారా అమ్ముతున్న తాటి వెంకటేశ్వరరావు, అతనికి సరఫరా చేసిన గగ్గలోతు సురేష్‌పై కూడా కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎస్సై జి.సునీల్, సిబ్బంది బి.వెంకన్న బాబు, కె.సత్యనారాయణ, ఏ.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

గీత కులాలకు మద్యం షాపులు

జంగారెడ్డిగూడెం: ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ జంగారెడ్డిగూడెం డివిజన్ పరిధిలో జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీలో గీత కార్మికులకు కేటాయించిన మద్యం షాపులకు డ్రా తీయనున్నట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనుబాబు తెలిపారు. 6వ తేదీ ఉదయం 8 గంటలకు ఏలూరు కలక్టరేట్ గోదావరి మీటింగ్ హాల్‌లో డ్రా కార్యక్రమం నిర్వహిస్తామని, ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారు హాజరు కావాలని శ్రీనుబాబు తెలిపారు.